# కేసీఆర్ సహకారంతో అద్భుత ప్రగతి


ఫైర్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

- నియోజకవర్గంలో అద్వితీయమైన అభివృద్ధి
- రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- బాల్కొండలో ఫైర్ స్టేషన్‌ను ప్రారంభించిన వేముల

బాల్కొండ, అక్టోబర్ 6 : సీఎం కేసీఆర్ సహకారంతో బాల్కొండ నియోజకవర్గంలో అద్వితీయమైన అభివృద్ధి జరిగిందని రాష్ట్ర రోడ్లు-భవనాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన అగ్నిమాపక కేంద్రాన్ని శుక్రవారం మంత్రి ప్రారంభించగా.. హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే 20 సబ్‌స్టేషన్లు, రూ. వెయ్యి కోట్లతో రోడ్లు, బ్రిడ్జిలు, గోదాములు నిర్మించినట్లు తెలిపారు. కేసీఆర్ తనపై చూపింపే ప్రేమను బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నానని, తన స్వార్థానికి వాడుకోవట్లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచన చేయాలని, కేసీఆర్‌ను, తనను ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రమాదాలు సంభవిస్తే వెంటనే స్పందించి నష్టాన్ని నివారించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఫైర్‌స్టేషన్ వారు ఏర్పాటు చేసిన బుక్‌లో సందేశం రాయాలని చెప్పగా.. 'ఫైర్‌స్టేషన్ అవసరం రావొద్దు.. ఒకవేళ వస్తే అత్యంత మెరుగైన సేవలందించాలి' అని రాసినట్లు వేముల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య, జడ్పీటీసీ లావణ్య, సర్పంచ్ బూస సునీత, బీఆర్‌ఎస్ మండల నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, రైతు నాయకుడు కె.నర్సింహానాయుడు, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న కేసీఆర్ సర్కారు


ఇంటిని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మలావత్ పూర్ణ, కుటుంబ సభ్యులు

- సొంతింటి కల పరి'పూర్ణ'ం
- ఎవరెస్ట్‌ను అధిరోహించిన పూర్ణకు ఇల్లు కట్టిస్తామని గతంలో హామీ
- కామారెడ్డిలో నిర్మించి ఇచ్చిన ప్రభుత్వం
- ప్రారంభించిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి, అక్టోబర్ 6: కేసీఆర్ ప్రభుత్వం మాట నిలబెట్టుకున్నది. సొంతింటి కలను పరి'పూర్ణ'ం చేసింది. ఎవరెస్ట్ పర్వతా న్ని అధిరోహించిన మలావత్ పూర్ణకు కామారెడ్డిలో ఇల్లు కట్టించి ఇచ్చింది. నిర్మాణం పూర్తి కావడంతో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ శుక్రవారం ప్రారంభించారు. మలావత్ పూర్ణది నిరుపేద గిరిజన కుటుంబం. ఎక్కడో మారుమూల తండాకు చెందిన ఆమె.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. కేసీఆర్ సర్కారు తీసుకొచ్చిన గురుకుల పాఠశాలలో చేరిన పూర్ణ జీవితం పూర్తిగా మారింది. ప్రభుత్వ చేయూత, ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో పర్వతారోహణలో శిక్షణ పొందింది. 2014లో కఠోర ప్రయాణాన్ని అధిగమించి ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించింది. అతిచిన్న వయస్సులోనే ఈ పర్వతాన్ని ఎక్కిన రికార్డును ఆమె సొంతం చేసుకుంది. ఈ క్రమంలో మలావత్ పూర్ణను ఘనంగా సత్కరించిన సీఎం కేసీఆర్.. ఆమెకు జాగాతో పాటు ఇల్లు కూడా కట్టిస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట మేరకు పూర్ణ కోరిన విధంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో 300 గజాల స్థలంలో రూ.47 లక్షల వ్యయంతో రాష్ట్రం ప్రభుత్వం నిర్మించింది. ఇటీవలే నిర్మాణం పూర్తి కాగా శుక్రవారం గృహప్రవేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ఇంటిని నిర్మించి ఇచ్చారని తెలిపారు. మలావత్ పూర్ణ కుటుంబ సభ్యులతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ,బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపిగౌడ్, గంద్ర మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీలు.. ప్రగతి నిరోధక పార్టీలు

- నా బాస్‌లు నియోజకవర్గ ప్రజలే
- ప్రాణం పోయినా ప్రజాక్షేత్రం వీడను
- అభివృద్ధిలో దూసుకెళ్తున్న ఆర్మూర్
- 'నమస్తే నవనాథపురం'లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి


మాక్లూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మాక్లూర్/నందిపేట/ ఆర్మూర్, అక్టోబర్ 6: కాంగ్రెస్, బీజేపీలు ప్రగతి నిరోధక పార్టీలని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. తన బాస్‌లు ఆర్మూర్ నియోజకవర్గ వాసులే అని పేర్కొన్నారు. ప్రాణం పోయినా ప్రజాక్షేత్రం వీడనని స్పష్టం చేశారు. నమస్తే నవనాథపురంలో భాగంగా శుక్రవారం మక్లూర్ మండల కేంద్రంలో ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జీవన్‌రెడ్డి బైక్ నడుపుతూ గ్రామస్తులతో కలిసి సందడి చేశారు. పలు సమస్యలను ఆయన అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం జరిగిన సభలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయ నేపథ్యం లేని తనను ఇంతవాడిని చేసిన ప్రజల రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనని అన్నారు. జీవితాంతం జీతగాడిలా ప్రజాసేవలోనే తరిస్తానని పేర్కొన్నారు. ఆర్మూర్ అభివృద్ధిని 2014కు ముందు తర్వాత అని బేరీజు వేసుకోవాలని సూచించారు. వందేండ్ల అభివృద్ధిని పదేండ్లలోనే చేసి చూపించానని అన్నారు. మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులెవరైనా వస్తే మారిన గ్రామాల రూపురేఖలు చూసి అవాక్కవుతారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మితే మన బతుకులు మళ్లీ అధోగతేనని అన్నారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. అభివృద్ధిలో దూసుకపోతున్న ఆర్మూర్‌ను ఆపడం ఎవరి తరం కాదన్నారు. ప్రజాశీర్వాద యాత్రలో పాల్గొన్న మహిళలకు జీవన్‌రెడ్డి బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. యువకులకు క్రికెట్ కిట్లు అందజేశారు. అనంతరం మాక్లూర్‌లోని ఉర్దూ పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రారంభించారు.

ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని దేవాంగ సంఘ ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రారంభించారు. పెర్కిట్ చెరువు కట్ట ప్రాంతంలో శుక్రవారం దేవి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఆలూర్ మండలం దేగాం నుంచి గోదావరి ఒడ్డు వరకు రూ. 4.65 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలు, యూత్ క్లబ్‌లకు క్రీడా సామగ్రిని జీవన్‌రెడ్డి పంపిణీ చేశారు.

**నందిపేట్‌లో ఫైర్ స్టేషన్ ప్రారంభం**

నందిపేట్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫైర్ స్టేషన్‌ను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఫైర్ ఇంజిన్‌ను ప్రధాన వీధుల్లో స్వయంగా నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నందిపేట్‌లో దశాబ్దాల కల నెరవేరిందన్నారు.

# మరోసారి ఆశీర్వదించండి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

- రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తా
- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా
- పద్మశాలీ కల్యాణ మండప నిర్మాణ పనులకు భూమిపూజ

ఖలీల్‌వాడి, అక్టోబర్ 6: ఇందూరు నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, తనను మరోసారి ఆశీర్వదించాలని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. మరింత ఉత్సాహంతో అభివృద్ధి చేస్తానని అన్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లీ మార్కండేయ మందిరం వద్ద పద్మశాలీ కల్యాణ మండప నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బిగాల శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ. కోటీ 50 లక్షలతో పద్మశాలీ కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. రూ.25 లక్షలతో భక్త మార్కండేయ మందిర పునర్నిర్మాణం, రూ. 20 లక్షలతో పద్మశాలి శ్మశాన వాటిక, రూ.కోటితో వసతి గృహం, పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమానికి రూ.5 లక్షలు, పాఠశాలలకు రూ.5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్లు సిరిగాద ధర్మపురి, చందుపట్ల వనిత, పద్మశాలీ సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు గుజ్జేటి వెంకటనర్సయ్య, ఎనుగందుల మురళి, ఢీకొండ యాదగిరి, పూల్గం హన్మాండ్లు, ఎస్‌ఆర్.సత్యపాల్, బిల్లా మహేశ్, నాగభూషణం, పద్మశాలీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


అమ్దాపూర్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షకీల్

- బోధన్ ఎమ్మెల్యే షకీల్
- పట్టణంతోపాటు పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

బోధన్/బోధన్ రూరల్/ అక్టోబర్ 6: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. శుక్రవారం ఆయన బోధన్ పట్టణంతోపాటు బోధన్ మండలంలోని పెంటకుర్దు, అమ్దాపూర్, రాజీవ్‌నగర్ తండా, ఊట్‌పల్లి, పెంటకుర్దు క్యాంప్ గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. బోధన్ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన బస్తీ దవాఖానను ప్రారంభించారు. సాలూర మండల కేంద్రంలో గిద్దె చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడుతూ.. తొమ్మిదేండ్లలో బోధన్ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిచేశామని తెలిపారు. పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.70 కోట్లను ఇచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ మత్స్యకారుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం పెగడాపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం, భూలక్ష్మీక్యాంప్‌లో జీపీ భవనం, చిన్నమావందిలో సొసైటీ గోదామును ప్రారంభించారు.